క్లుప్తంగా

బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలు తక్కువ ఉన్నారంటూ సాకు చెప్పి బీసీలకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆపార్టీ యువజన నాయకులు కాతోజు వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం జప్తీవీరప్పగూడెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందనే విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర ఇంటింటి సర్వే పేరుతో ప్రజలను మభ్య పెట్టడంతో పాటు 56శాతం ఉన్న బీసీలను 46శాతం మేరకు ఉన్నారని చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు సత్యనారాయణ, ఉమారెడ్డి, చంద్రమౌళి, నవీన్ తదితరులున్నారు.

ప్రమోషన్‌ను ఆపాలని నేడు ధర్నా

మిర్యాలగూడ : అనర్హులకు అడ్డదారిలో కల్పిస్తున్న ప్రమోషన్లను ఆపాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడ విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు టీజీఈఈ327 యూనియన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తిపై పలు ఆరోపణలపై విజిలెన్స్ ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు అడ్డదారిలో అతనికి ప్రమోషన్ ఇచ్చేందుకు లైన్‌క్లియర్ చేస్తున్నారని ఆరోపించారు. అనర్హులకు ప్రమోషన్లను ఆపాలని లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ : సోలార్ లైటింగ్ ఏర్పాటు వల్ల పంట నష్టపోయాయని తనను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం బాధితుడు అనుముల సైదయ్య సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు సైదయ్య మాట్లాడుతూ శ్రీనివాస్‌నగర్ గ్రామ శివారులో గల సర్వే నంబర్ 260లో శాగం దామోదర్‌రెడ్డికి చెందిన 1.30 ఎకరాలను కౌలుకు తీసుకోని వ్యవసాయం చేస్తున్నానన్నారు. తాను సాగు చేసే పొలం వద్ద గల గేటుకు సంగం డెయిరీ యాజమాన్యం సోలార్ లైటింగ్ అమర్చారని ఆ లైట్ ద్వారా వరి పొలానికి కంకులు రాలేదని దీంతో సుమారు 20బస్తాల పంట నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. న్యాయం చేయాలని డెయిరీ యాజమాన్యాన్ని అడగగా పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు పరిహారం ఇవ్వమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కౌలు రైతునైన తనకు అధికారులు న్యాయం చేయాలని సబ్ కలక్టర్‌ను కోరారు.

అడవిదేవులపల్లి ఎంపీడీఓగా రమేష్



అడవిదేవులపల్లి : స్థానిక ఎంపీడీవోగా మాతంగి రమేష్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ కరుణాకర్ మిర్యాలగూడకు వెళ్లగా మిర్యాలగూడ ఎంపీఓగా పనిచేస్తున్న మాతంగి రమేష్ బదిలీపై అడవిదేవులపల్లి ఎంపీడీఓగా వచ్చారు. అనంతరం గ్రామ కార్యదర్శుల తో పాటు అన్ని శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.

డంపింగ్ యార్డు తొలగించాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రాంనగర్ బంధం సమీపంలోని డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు ఆ పరిసరాల ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంనగర్ బంధం, పద్మావతినగర్, అవంతిపురం, బాధలాపురం, ఈదులగూడెం ఏనే, గూడూరు ప్రాంత వాసులు మాట్లాడుతూ 15ఏళ్లుగా డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును ఇక్కడ ఏర్పాటు చేసే సమయంలో చెత్తను రీసైక్లింగ్ చేసి కంపోస్ట్ ఎరువుల తయారు చేస్తామని చెప్పారన్నారు. ఇటీవల ఆందోళన చేయడంతో వర్మీ కంపోస్ట్ చేస్తున్నారని, ఇక్కడి నుంచి తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

ఇండియన్ ఒలింపిక్స్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

నాగార్జునసాగర్ : నెట్‌బాల్ 38వ నేషనల్ గేమ్స్ (ఇండియన్ ఒలింపిక్స్)కు సాగర్ యువకులు ఎంపికయ్యారు. సంయుత్‌నాయుడు, ధనుష్‌వెంకట్ నాయక్‌లు మహబూబ్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో రెండు వారాలుగా నిర్వహించిన క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి ఒలింపిక్‌కు ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి 15వరకు ఉత్తరాఖండ్‌లో నిర్వహించే నేషనల్ గేమ్స్(ఇండియన్ ఒలింపిక్స్)కి వెళ్తున్నట్లు నెట్‌బాల్ ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రెటరీ కిరణ్ తెలిపారు.

బోర్లు వేశారు.. మోటార్లు మరిచారు

- మూడేళ్లుగా ముందుకుసాగని గిరివికాసం
- కదలని కరెంటు పనులు
- ఆరుతడి పంటల సాగుకు రైతుల కష్టాలు

గుర్రంపోడు: గిరివికాస పథకం క్రింద తమ భూములకు సాగు నీరు అందుతుందని, కరెంటు కష్టాలు తీరుతాయని ఆశించిన లబ్ధిదారుల ఆశలు అడియాశలవుతున్నాయి. మూడేళ్లుగా ఈ పథకం కేవలం బోర్లు వేయడంతోనే నిలిచి కరెంటు సౌకర్యం, మోటార్ల కొరకు రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. నత్తకే నడక నేర్పేలా సర్వేలతోనే కాలయాపన జరుగుతూ ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలకు సాగు నీరు అందే పరిస్థితి లేక గిరిజన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. బోర్లు వేసి ఏడాది గడిచినా ఇంతవరకు మోటార్లు ఎప్పుడిస్తారో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

ఆర్థిక స్థోమత లేక సొంతంగా బోరు, మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించులేక మెట్ట పంటలనే నమ్ముకుని ఎదుగుబొదుగు లేని జీవితాలు గడుపుతున్న గిరిజన రైతుల భూములను సాగులోకి తెచ్చేలా అవసరమైన మౌలిక వసతులన్నీ సమకూర్చి బీడు భూములను సాగులోకి తేవాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం గిరివికాస పథకాన్ని అమలులోకి తెచ్చింది. గ్రామీణాభివద్ధి శాఖ ద్వారా అమలు జరిగే ఈ పథకానికి 2022లో మండంలోని తేనపల్లి తండా, ఘాశీరాంతండా గ్రామాల్లో గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి 10 ఎకరాలను యూనిట్‌గా తీసుకుని 27బ్లాకులుగా 40మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. సుమారు 80ఎకరాల భూమి ఈ పథకం ద్వారా సాగులోకి తీసుకురావాల్సి ఉంది.



తేనపల్లి తండాలో గిరిజన రైతు భూమిలో వేసిన బోరు

బోర్లు వేయడంతోనే సరి

గత ఏడాది జలవనరుల శాఖ ద్వారా లబ్ధిదారుల భూముల్లో సర్వే జరిపించి 16బోర్లు వేయగా 12 బోర్లలో నీరు వచ్చింది. వీటన్నింటికీ మోటార్లు ఇచ్చి కరెంటు సౌకర్యం కల్పిస్తే తాము పంటలు పండించకుంటామని రైతులు అంటున్నారు. అయితే మోటార్ల కోసం తాము అధికారుల చుట్టూ ఏడాదిన్నరగా తిరుగుతున్నా నిధుల మంజూరు లేదని, మోటార్లకు ప్రతిపాదనలు పంపించామన్న సమాధానమే వస్తుంది. కరెంటు సౌకర్యం కల్పనకు విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు అవసరమైన ఎస్టిమేషన్ వేయాల్సి ఉండగా విద్యుత్‌శాఖకు ఇందుకు అవసరమైన నిధుల మంజూరు లేక అడుగు ముందుకు పడటం లేదు.

జాడ లేని భూమి అభివృద్ధి పనులు

లబ్ధిదారుల భూముల్లో రాళ్ల తొలగింపు, వాలుకు అడ్డు కట్టలు వేయడం, నీటి కొలనుల నిర్మాణాలు తదితర పనులన్నీ చేపట్టి భూమిని అభివద్ధి లోకి తేవాల్సి ఉండగా ఈ పనుల ప్రతిపాదనలకు కూడ నోచుకోక భూములు సాగులోకి వచ్చేదెప్పుడో అని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.



మోటార్లు ఇవ్వక దూర ప్రాంతం నుంచి పైపుల ద్వారా ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులు

తక్షణమే మోటార్లు ఇవ్వాలి



వేసిన బోర్లకు తక్షణమే మోటార్లు అందించాలి. కరెంట్ మోటార్లు ఇస్తే పక్క రైతుల నుంచి కరెంటు తీసుకుని విద్యుత్‌లైన్లు వేసే వరకు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటాం. ప్రస్తుత వేసవిలో కూరగాయ పంటలు సాగు చేసుకుంటాం . వేసిన బోర్లకు మోటార్లు బిగించకపోతే బోర్లు పూడిపోయే ప్రమాదం ఉంది.

– వడిత్య జవహర్‌లాల్, తేనపల్లి తండా

ప్రతిపాదనలు పంపాం

కరెంటు మోటార్ల మంజూరుకు గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఉపాధి హామీ కింద భూమి అభివృద్ధి పనులు జరిపిస్తాం.

– గోపాల్‌రెడ్డి , ఏపీఓ

బయో ఎంజైమ్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడలో నేచురల్ బయో ఎంజైమ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాద్రిపాలెంలో బోధిధర్మ బయో ఎంజైమ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్లాంట్ మిర్యాలగూడ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డిలు పాల్గొని క్యాన్సర్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి మాట్లాడారు. అదేవిధంగా బోదిధర్మ ఆయుర్వేద పీఠం వైద్యుడు పండిట్ శ్రీనివాస్ క్యాన్సర్ రోగులకు నిరంతరం సేవ చేయడమే లక్ష్యంగా బయో ఎంజైమ్ ద్వారా ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌గుప్తా, దుర్గంపూడి నారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, అంగోతు లలితహాతీరాంనాయక్, సజ్జల రవీందర్ రెడ్డి, వనం మదన్‌మోహన్, సుప్రియా, కొండా మాధవి, మునీర్, గడగోజు ఏడుకొండలు, చింతల వెంకటేశ్వర్లు, కీర్తి, సంతోష్‌రాజు, భీష్మా పాల్గొన్నారు.



బయో ఎంజైమ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వైభవంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని కృష్ణానది తీరంలోని బౌద్ధమ ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సూర్యనారాయణస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపద్మిని ఛాయ ఉష సహిత సూర్యనారాయణ స్వామి వారి కల్యాణాన్ని మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మ–చిన రామయ్య దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు యడవల్లి రఘురామయ్యశర్మ, అనంత కృష్ణ శర్మల వేదమంత్రోత్సవాల మధ్య అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కల్యాణం తరువాత భక్తులకు మహా అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశెట్టి కోటేశ్వర్‌రావు, గాయం ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలునాయక్, ఇంజం శ్రీధర్, నాగార్జున, మాజీ వైస్ ఎంపీపీ కూరాకుల మల్లేశ్వరీ గోపినాథ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

దేవరకొండ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. మంగళవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యలను తనదైన శైలిలో పరిష్కరించినట్లు ఆయన గుర్తు చేశారు. ఇప్పటికీ పరిష్కరించకుండా ఉన్న డీఏ బకాయిలు, మెరుగైన పీఆర్సీ, 317బాధితులకు న్యాయం, సీపీఎస్ రద్దు, మోడల్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాల చెల్లింపు వంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సదానంద్‌గౌడ్, కృష్ణుడు, పర్వతరెడ్డి, నగేష్, కరుణాకర్ రెడ్డి, రవికుమార్ యాదవ్, నారాయణయాదవ్,రాందాస్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పూల రవీందర్

అదనపు కట్నం కేసులో ఆరు నెలలు జైలు

మిర్యాలగూడ టౌన్ : అదనపు కట్నం వేధింపుల కేసులో నింధితులపై నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.15వేల జరిమానా విధిస్తూ మంగళవారం మిర్యాలగూడ ఒకటో అదనపు మెజిస్ట్రేట్ బీఎస్ఎన్ సుమబాల తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. 2019లో పట్టణానికి చెందిన షేక్ ఫర్హాన తన అత్త, మామలతో పాటు భర్త అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేయడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కుర్మయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. దీంతో అదనపు కట్నం కేసులో నింధితులు అయినా పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన షేక్ జాహీంగీర్, షేక్ జానిమియా, షేక్ బీబీలపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.15 వేల జరిమానాతో పాటు ఆరు నెలలు జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ సుధాకర్ వాధించగా కోర్టు కానిస్టేబుల్ పెద్ది రాజు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

రంజాన్ ఏర్పాట్లు చేయాలని వినతి

మిర్యాలగూడ : పట్టణంలోని సరాయే మీరాలం మసీద్‌లో రంజాన్ సందర్భంగా ఏర్పాట్లు చేయాలని మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు మసీద్ ముసల్లియాస్ వినతిపత్రం అందజేశారు. అయితే మసీద్ పదవికాలం 16నవంబర్ 2024న ముగిసిందని అప్పటి నుంచి ఆలనాపాలన చూడాల్సిన బాధ్యత వక్ఫ్‌బోర్డుదేనన్నారు. బోర్డు తరుపున ప్రతినిధిని నియమించలేదని పేర్కొన్నారు. రంజాన్ ఉపవాసాల మాసం మార్చి 1 నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. మసీద్‌కు సున్నం వేసే పనులు, నీటి సరఫరా, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు బాధ్యులెవరూ లేకపోవడంతో నిర్వహణ కష్టమవుతుందన్నారు. మిర్యాలగూడ డివిజన్ వక్ఫ్ అధికారి బాధ్యతల దృష్ట్యా జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించి ఏర్పాట్లు చేయించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మసీద్ మాజీ కమిటీ సభ్యులు ఎండి.అస్లాం, ముసల్లియాస్ షేక్ అబ్దుల్లా, ఎంఎ.సమీఖాద్రి, ఎండి.ముజీబ్, ఎండి.ఆరిఫ్, జహంగీర్, మోహిద్, ఖాజా హమీదుద్దిన్, ఎస్‌కె.అయూబ్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న మసీద్ ముసల్లియాస్ నాయకులు

ఘనంగా రథ సప్తమి వేడుకలు



హాలియా : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మిర్యాలగూడ టౌన్ : రైల్వే కాలనీలో..

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శ్రీసాయి దత్తాశ్రమంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీనాగసాయి, దత్తాత్రేయలకు అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారీ అజయ్ త్రిపాటి ఆధ్వర్యంలో రంగులతో సూర్యుడి బొమ్మను గిసి నైవేథ్యం వండి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రతాఫ్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జానకిరాముడు, విక్రం, వాసు, అంజిబాబు, పద్మ, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

హాలియా : పట్టణంలోని స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు గోవర్ధనా రాఘవాచార్యులు పర్యవేక్షణలో రామాచార్యులు ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి పంచామృత అభిషేకాలు, సామూహిక ఆదిత్య హృదయ స్తోత్రం, పారాయణం, అర్చన, పొంగలి నివేదన తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు ఉన్నారు.

బాసర నిత్యాన్న సత్రం కార్యదర్శిగా శ్రీరాములు



దేవరకొండ : బాసర అఖిలభారత పద్మశాలి నిత్యాన్న సత్రం కార్యదర్శిగా దేవరకొండ పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు సిరిపోతు శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం బాసరలో నిర్వహించిన నిత్యాన్నసత్రం కమిటీ ఎన్నికలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన పెద్దలకు, పద్మశాలి సంఘం నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన యువకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. సమావేశంలో చింతపల్లి సుభాష్, రేటినేని ముత్యపురావు, రమావత్ తులసిరాం, ఇస్లావత్ అభిషేక్, బసీర్, హబీబ్, పీటర్ తదితరులున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పెద్దఅడిశర్లపల్లి : దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మేడారంలో శ్రీలక్ష్మి నర్సింహాస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి, ముత్యంరావు, అర్వపల్లి నర్సింహా, నరేందర్‌నాయక్, ఎర్ర యాదగిరి, రాయినబోయిన శ్రీను,కర్నాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవింద్ మృతి బాధాకరం

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుండాల గోవింద్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం గోవింద్‌మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవింద్ ఎంపీటీసీగా చేసిన సేవలు మరువలేవన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి, ముత్యంరావు, నర్సింహా, నరేందర్‌నాయక్, పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మిర్యాలగూడ : జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించడానికి కేంద్రం బృందం(పాపులేషన్ రీసెర్చ్ సెంటర్) సభ్యులు మంగళవారం దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందరించారు. ఈ సందర్భంగా రీసెర్చ్ అధికారి కార్తీక్, డాక్యుమెంటేషన్ అధికారి దేవ్‌రాజ్‌లు ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతావాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, సీహెచ్‌ఓ శ్రీను పాల్గొన్నారు.

రైతు సేవా సహకార సంఘం తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీలక్ష్మి

కొండమల్లేపల్లి : స్థానిక రైతు సేవా సహకార సంఘాన్ని మంగళవారం దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎస్‌సీఎస్ కొండమల్లేపల్లిలో యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి యూరియాను కొనుగోలు చేయొచ్చని తెలిపారు. ఆమె వెంట ఏఓ జానకిరాములు, సీఈఓ తిరుపతిరెడ్డి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

దేవరకొండ : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేయి గొంతుకల సభ ప్రచార పోస్టర్‌ను ఆసంఘం నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

చింతపల్లి : ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పులు.. వేయి గొంతుకల బహిరంగ సభ ప్రచార పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు రమేష్, నియోజకవర్గ నల్ల శ్రీకాంత్ మాట్లాడారు. ఈ నల్ల కాశయ్య, అఖిల, శిరీష పాల్గొన్నారు.

డిండి : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'లక్ష డప్పులు.. వేయి గొంతుకలు' ప్రచార పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఆవ్కిరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు జంతుక రేణయ్య ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినత్సోవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

హాలియా : పట్టణంలోని లక్ష్యా ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలడైరెక్టర్లు సతీష్, విజయ బాస్కర్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

'బీసీలను అణచివేస్తున్న కాంగ్రెస్'

మిర్యాలగూడ టౌన్ : కుల గణన లెక్కలను తప్పుగా చూపుతూ కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గాన్ని అణచివేస్తుందని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆరోపించారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ విధానం ఇదే విధంగా కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణమాచారి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సునిత, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థినికి ప్రథమ బహుమతి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన చామకూరి హాసినిరెడ్డి నృత్య పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి మొదటి బహుమతిని అందుకుంది. ఈ నెల 3 నుంచి హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నుమాయిష్–2025ను నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన నృత్య పోటీల్లో ఆ గ్రామానికి చెందిన హాసినిరెడ్డి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపర్చి ఆహూతులను ఆకట్టుకుంది. దీంతో ప్రథమ బహుమతిని గెల్చుకోవడంతో నిర్వాహకులు జ్ఞాపికతో పాటు నగదు బహుమతిని అందించారు. ప్రముఖ గాయకులు, కళాకారులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో హాసినిని అభినందించారు. నృత్య ప్రదర్శనలో అత్యుత్తమ కనపర్చిన హాసినిని తల్లిదండ్రులు, అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపించిందని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పూనుకుందని సీపీఎం రాష్ట్ర నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శిగ్ర సైదానాయక్, నాయకులు ప్రసన్న, వీరన్న, సంపత్, మణి, అనిల్, అఖిల్, శివ, పాల్గొన్నారు.

తప్పుడు సర్వే లెక్కలు మానుకోవాలి

దేవరకొండ : బీసీ జనాభాపై ప్రభుత్వం తప్పుడు సర్వే లెక్కలు మానుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముం దు కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు సర్వేలో తప్పుడు లెక్కలు చూపిస్తుందని ఆయన ఆరోపించారు. తప్పుడు లెక్కలు పక్కకుపెట్టి తిరిగి బీహార్ తరహాలో సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చొల్లేటి భాస్కరాచారి, కృష్ణ, లలిత, బాషనాయక్, కోటేష్, బాలు, ఆంజనేయులు, చంద్రమౌళీ, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

చింతపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా ఉంది అని బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సివర్ల రమేష్ యాదవ్,వెన్నం శేఖర్, కుక్కుట రామకృష్ణ, వెంకన్న, అభినవ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొండమల్లేపల్లి : మిషన్ భగీరథ కార్మికులకు ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి కోరారు. ఈ మేరకు పెండ్లిపాకల మిషన్ భగీరథ ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికులతో కలిసి మంగళవారం మిషన్ భగీరథ ఎస్‌ఈ కరుణాకర్‌రెడ్డి, డీఈ హైమాద్, క్యూసీ క్వాలిటీ కంట్రోల్ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. నిత్యావసర సరుకులు కొనాలన్న ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో మిషన్ భగీరథ కార్మికులు రమావత్ నరేష్, జగపతిరావు, కృష్ణ, ఆర్.రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన పేరూరు కోటయ్య ఇటీవల అకాల మృతి చెందారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యుడు పేరూరు శ్రీనివాస్‌కు రూ.5వేల సాయం అందించి నివనాళులర్పించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చాపల వెంకన్న మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

డిండి : గ్రామపంచాయతీల్లో మాజీ సర్పంచ్‌లు చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 'చలో అసెంబ్లీ' ద్వారా శాంతియుత నిరసన తెలిపే కార్యక్రమానికి వెళ్లకుండా మగళవారం బీఆఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.